కూరగాయల పంటలతో ఆదాయం

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు రాక రైతులు నష్టాలపాలవుతున్నారు. కళత్తూరుకు చెందిన రైతు కె.పటాభిరెడ్డి మాత్రం కూరగాయలు సాగుచేస్తూ అధిక ఆదాయం పొందుతున్నాడు. డిమాండ్‌ను బట్టి ఏడాది పొడవునా కాకర, బెండ, బీర తదితర పంటలు సాగు చేస్తున్నాడు. పలువురు కూలీలకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కష్టంతోపాటు కొంచెం ఆలోచన చేసి సీజన్, డిమాండ్‌ను బట్టి పంటలు సాగు చేస్తే ఆదాయం పొందవచ్చని నిరూపిస్తున్నాడు.

- సంవత్సరం పొడవునా ఉపాధి
- తక్కువ ఖర్చు.. అధిక ఉత్పత్తి
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతు పట్టాభిరెడ్డి

సత్యవేడు: కేవీబీపురం మండలం కళత్తూరు గ్రామానికి చెందిన పట్టాభిరెడ్డి ఇంటర్ వరకు చదివారు. స్నేహితులు ఉద్యోగాల వైపు వెళుతుండగా ఆయన మాత్రం వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఐదు ఎకరాలలో పంటల సాగుకు ఉపక్రమించాడు. సాధారణంగానే అనుకున్న మేర ఉత్పత్తులు రాక నష్టాలపాలయ్యాడు. తర్వాత కొంత ఆలోచన చేశాడు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపై దృష్టిసారించాడు. అధికారులను కలిసి కొంత మేర మెళకువలు పొందాడు. తర్వాత కూరగాయల సాగుపై దృష్టిసారించాడు. తనకున్న ఐదు ఎకరాలతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. కాకర, బెండ, బీర, వంగ తదితర కూరగాయల పంటలు సాగు చేయడం మొదలుపెట్టాడు. తాను పండించిన కూరగాయలను స్థానికంగా వున్న మార్కెట్లకు కాకుండా ప్రతిరోజూ లారీలో చైన్నైలోని కోయంబేడు మార్కెట్‌కు తరలిస్తున్నాడు. ఇక్కడి కంటే అక్కడ ధర కూడా ఎక్కువగా వస్తోంది. కూరగాయలను 25 కేజీల లెక్కన ట్రేలలో వేసి బాక్సు లెక్కన విక్రయిస్తున్నారు. ఒక్కో బాక్సుకు రూ.40లు ఇస్తున్నారు. డిమాండ్ ఉంటే రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతుంది. ఇక్కడి మార్కెట్లలో ఒక్కో ట్రేలో 35 కేజీలు వేస్తారు. ధర కూడా తక్కువకు అడుగుతారు. అందువల్లే కాయలను చెన్నైకి తరలిస్తున్నట్లు రైతు చెబుతున్నాడు. పంటల సాగులో అన్ని ఖర్చులు పోను ఏడాదికి రూ.లక్షకు పైగానే మిగులుతోందని పేర్కొంటున్నాడు.

పలువురు కూలీలకు ఉపాధి

సీజన్‌తో పాటు డిమాండ్‌ను బట్టి పలురకాల కూరగాయల పంటలు సాగుచేస్తున్నాడు. పలువురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాడు. కాకర పంట 5 ఎకరాలు, బీర 5 ఎకరాలు, బెండ ఐదు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. వ్యవసాయ అధికారుల సహకారం లేకుండానే అనుభవంతో తెగుళ్ల రాకుండా ముందుగానే నివారణ చర్యలు తీసుకుంటూ అధిక దిగుబడి సాధిస్తున్నాడు. కాకర పంట సాగుకు రూ.90 వేలు, బెండకు రూ.50 వేలు, బీరకు రూ.80 వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు మిగులుతోందని రైతు పట్టాభిరెడ్డి చెబుతున్నాడు.



పొలంలో బెండ కాయలు కోస్తున్న కూలీలు





చెన్నైకి తరలించేందుకు కూరగాయలను మూటలు కడుతున్న కూలీలు, కాకర పంటను పరిశీలిస్తున్న పట్టాబి రెడ్డి



సాగు చేస్తున్న కాకర పంట

వ్యవసాయ అధికారుల సహకారం అందించాలి

వ్యవసాయ అధికారులు పంటల సాగులో రైతులకు సహకారం అందించాలి. పలు రకాలు పంటలు సాగు చేస్తున్నా అధికారులు పొలంవైపు రావడం లేదు. తుపానులతో పంట పాడైనప్పుడు వస్తారు. పంట నష్టం రాసుకుపోతారు. పరిహారం ఇవ్వరు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తే నష్టాలు రాకుండా ఉంటుంది.

–కె.పట్టాభిరెడ్డి, కళత్తూరు

ఉపాధి కల్పిస్తున్నారు..



కూరగాయల సాగులో 120 మందికి పైగా వ్యవసాయ పనులు చేస్తున్నాం. మాకు సంవత్సరం పొడవునా బెండ, బీర, కాకర ఇతర పంటల్లో పని ఉంటోంది. కూరగాయలు కోయడం, మూటలు కట్టి లారీల్లో ఎక్కించడం, పొలాన్ని దుక్కి దున్నడం, కలుపుతీయడం వంటి పనులు చేస్తున్నాం. పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానికంగానే పనులు చేసుకుంటున్నాం.

–చిన్న చెంచయ్య, కస్తూరిపురం

చదువుకు ఆర్థిక సాయం



మా ఎస్టీల కుటుంబాల్లోని పిల్లలు చదువుకోవాలని పట్టాభిరెడ్డి ఆర్థిక సాయం అందిస్తున్నారు. చదువు ఉంటేనే బతుకు బాగు పడుతుందని మా పిల్లలకు చెబుతూ ఉంటారు. మేము మా బిడ్డల్ని చదివించుకుంటూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటున్నాం. రైతు వద్ద చేరినప్పటి నుంచి మాకు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. ఇంట్లో ఎవరికి కష్టమొచ్చినా ఆదుకొంటున్నారు.

–విజయలక్ష్మి, కేవీబీపురం

కోత పనులు చేస్తాం



బరువు ఎత్తలేని ఆడవాళ్లు కోత, కలుపు పనులు చేసుకుంటాం. సంవత్సరం పొడవునా మాకు పొలంలో కలుపు పనులు దొరుకుతున్నాయి. పస్తులు లేకుండా గంజి తాగుతున్నాం. డ్వాక్రా సంఘాల్లో చేరాం. అక్కడ తీసుకున్న రుణాలను సకాలంలో కట్టుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు ఏది ఉన్నా మాకు చెబుతారు. ఇక్కడ మాకు చేతినిండా పని దొరుకుతోంది.

–రాధ, కేవీబీపురం

క్లుప్తంగా

నిశ్చితార్థం వేడుకలో మాజీ మంత్రి



కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం ఇసుకతాగేలి పంచాయతీ గోపాలపురంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు మహేష్ కుమార్తె ఎం.లహరి, కె.ఈశ్వర్ నిశ్చితార్థ వేడుకకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ కందాటి గురవమ్మ, ఎంపీటీసీ టి.క్రిష్ణవేణమ్మ, ఉప సర్పంచ్ ఏ.వనజాక్షి, ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు



లాటరీలో వచ్చిన ప్లాట్ నంబర్ చూపుతున్న షికారీ మహిళ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట సంతగేటు సమీపంలో రైల్వే లైన్‌కు ఇళ్లు కోల్పోయిన బాధితులకు శుక్రవారం ఇళ్ల స్థలాలకు బంధించిన ప్లాట్ నంబర్లను లాటరీ ద్వారా కేటాయించారు. రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జేసీ శుభం బన్సల్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీనగర్, గువ్వల కాలనీ వాసులకు 47 ప్లాట్లు కేటాయించారు. చిన్నపాటి సమస్యలు ఉండడంతో మరో ఐదు ప్లాట్లను తర్వాత కేటాయిస్తామని తహసీల్దార్ సురేష్ బాబు తెలిపారు. జేసీ మాట్లాడుతూ లబ్ధిదారులు చేతుల మీదుగా లాటరీ తీసి ప్లాట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఒక్కొక్కరికి మూడు సెంట్లు భూమిని కేటాయించినట్లు తెలిపారు.

తెలుగు టీచర్‌ను నియమించాలని వినతి



ఎంఈవో భారతికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని ఎగువ సాంబయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిని నియమించి 10వ తరగతి విద్యార్థులను ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ తిరుపతి సహాయ కార్యదర్శి కోగిలి. మునిచందు కోరారు. వారు శుక్రవారం ఎంఈవో భారతికి వినతి పత్రం అందజేశారు. మునిచందు మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న తెలుగు టీచర్‌ను అవాస్తవాలతో సస్పెండ్ చేశారని, ఆయనను తిరిగి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనీ, చరణ్, వేణు, ముని బాబు, భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం సిద్ధలయ్య గుడి సమీపంలో గురువారం సాయంత్రం లారీ ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. మృతుడు బ్లూ రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. శనివారం కేసు నమోదు చేసి శవపంచనామా అనంతరం దహన సంస్కారాలు చేస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ క్యాన్లు వితరణ



క్యాన్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

వరదయ్యపాళెం: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని బీజేపీ నాయకులు కేబీ గురుదేవ్, ఆర్.మురళీ సహకారంతో 65 అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ క్యాన్లు వితరణ చేశారు. వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో క్యాన్లను అంగన్‌వాడీ వర్కర్లకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్ రాయల్, నాయకులు గుత్తి త్యాగరాజు, ప్రతాప్, పురుషోత్తమ్, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ కంపోస్ట్ ఫిట్, కిచెన్ గార్డెన్‌తో ఆదాయం



మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రతి మహిళా తప్పనిసరిగా మహిళ హోమ్ కంపోస్టు ఫిట్, కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆదాయం పొందవచ్చని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో హోమ్ కంపోస్ట్ ఫిట్, కిచెన్ గార్డెన్ ఏర్పాటు కోసం ఆసక్తి గలవారిని గుర్తించాలన్నారు. మండలంలో 3,066 మందిని 22వ తేదీలోపు నమోదు చేయాలని తెలిపారు. అలాగే ఏపీఎస్ పీడీసీఎల్ ద్వారా పీఎం సూర్య ఘర్ పథకం కింద గృహ అవసరాలకు సబ్సిడీపై సోలార్ విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ వనజ, ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు



ప్రత్యేక గుర్తింపు సంఖ్య కోసం ఆన్‌లైన్ రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏవో భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డు జారీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు భరోసా కేంద్రంలో రైతు గుర్తింపు సంఖ్య కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు వారి ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్ తీసుకుని రైతు భరోసా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే రాబోవు రోజులకు రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో రేవతి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నూకతోటిరాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామం గిరిజన కాలనీకి చెందిన ఇద్దరు అనాథ పిల్లలకు అదే గ్రామానికి చెందిన వైద్యురాలు సుమతి, ఆమె భర్త డాక్టరు శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. తల్లిదండ్రులు లేని అనాథ గిరిజన పిల్లలకు ఆర్థిక సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని నూకతోటి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనరు వేలూరు రాకేష్, మండల కన్వీనరు మణినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురునాథం, మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, ప్రసాద్‌పాల్, సంజీవయ్య, వెంకటేష్, రాజశేఖర్, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం చేశారని ఫిర్యాదు



దగ్ధమైన ద్విచక్ర వాహనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని తన ఇంటి వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని నీర్పాకోట దళితవాడకు చెందిన నరసింహులు గురువారం అర్ధరాత్రి దగ్ధం చేశాడని శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ముత్తులింగేశ్వరయ్య ఫిర్యాదు చేశారు. నరసింహులు మద్యం మత్తులో రాత్రి సమయంలో ఇంటి వద్దకు వచ్చి గొడవ చేసి వెళ్లి, అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి కాల్చివేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ద్విచక్రవాహనం విలువ రూ.లక్ష ఉంటుందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల వేళలు మార్పు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ సభ్యులు

శ్రీకాళహస్తి: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల వేళల్లో మార్పు చేయాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మురళీకృష్ణ, బి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నూతనంగా విద్యాశాఖ విడుదల చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు ఉదయం 9 నుంచి 11:45 గంటల వరకు పాఠశాల విధులు నిర్వహించుకుని మధ్యాహ్నం ఒంటి గంటకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలని సూచించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగే రోజున 11.45 గంటలకు పిల్లలను ఇంటికి పంపడం సరికాదని వెల్లడించారు. ఉపాధ్యాయులు సీఆర్పీ సమావేశాలకు మధ్యాహ్నం ఒంటి గంటకు రావడానికి ఇబ్బంది పడతారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు సమావేశాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె వెంకటాద్రి, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌బాబు, చంద్రశేఖర్, సంఘం బాధ్యులు మస్తాన్, మధు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ముసలిపేడు బత్తినయ్య కొండమార్గాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నగేశం

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం ముసలిపేడు పంచాయతీ బత్తినయ్య కొండ, చెల్లూరు సమీపంలోని సదాశివకోనలో చేపట్టిన శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ జయచంద్ర పరిశీలించారు. అటవీ మార్గం కావడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అటవీ మార్గంలో వెళ్లే సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట పట్టణంలోని హిందూ శ్మశానవాటిక ఆవరణలో ఉన్న పరమశివుడి విగ్రహం వద్ద సర్పంచ్ నగేశం పలు పనులు చేపట్టారు. విగ్రహం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి టైల్స్ వేసి రంగులు కొట్టించారు.

బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం





సినీనటుడు చిరంజీవి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో 21 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పలువురి ప్రముఖులను శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాదులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటులు చిరంజీవి, నితిన్ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



ఇందిరానగర్‌లో సునీల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ శుక్రవారం వరదయ్యపాళెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందిరానగర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ బీఎన్‌కండ్రిగ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ సునీల్ తల్లి ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎంజీనగర్‌లో మృతి చెందిన పార్టీ నాయకుడు శ్రీరాములు రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చిన్న పాండూరు వడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర నానమ్మ డి.రోశమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరదయ్యపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దీనకర్లయ్య సతీమణి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. రాచర్లలో మృతి చెందిన పార్టీ నాయకుడు శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చివరగా అకిసింపాళెంలో టెన్ టీవీ పాత్రికేయుడు దొడ్డి శేఖర్ తల్లి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, యూత్ అధ్యక్షులు వినోద్ యాదవ్, ప్రచార కమిటీ అధ్యక్షులు శివా యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుద్దు వేణు, చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు గిరిరెడ్డి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, పక్కన ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ

శ్రీకాళహస్తి: పౌష్టికాహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, వారిలో ఎదుగుదల బాగుంటుందని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, శ్రీ సరస్వతీ బాయి పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ– పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ పిల్లల్లో పోషక లోపాలను గుర్తించి ఎదుగుదల బాగుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపించే పోషకాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగే శివ పార్వతుల కల్యాణం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతాయని, వాటిని అరికట్టాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, హెచ్‌ఎం రాజేశ్వరి, రిసోర్స్‌పర్సన్ హరిత, లక్ష్మి పాల్గొన్నారు.

పిల్లల భవితకు పునాది అంగన్‌వాడీలు

నాగలాపురం: పిల్లల భవితకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే గట్టి పునాదులు వేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని స్థానిక వైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం పోషన్ బీ -పడాయిబీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు పిచ్చాటూరు ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ ఇచ్చారు. ఇందులో వైద్యాధికారి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనతకు గురవుతున్న పిల్లలపై దృష్టిసారించి, క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కిశోర బాలికలు, వారి తల్లులకు సమావేశాలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచాలని కోరారు. ఈ కర్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్‌వో వేణుగోపాల్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి



బుచ్చినాయుడుకండ్రిగ: మాట్లాడుతున్న సీడీపీవో దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సీడీపీవో దేవకుమారి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ–పడాయి బీపై రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఆరేళ్లలోపు పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేసే అంశాలను వివరించారు. పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సూపర్‌వైజర్ యమున పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరుల తల్లి చిద్విలాసం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీకృష్ణ మండపంలోకి వేంచేపు చేశారు. కనుల పండువగా కల్యాణం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.